బాబోయ్.. కుక్కలు, కోతులు

రాత్రీపగలు వీధుల్లో స్వైరవిహారం

- గాయాలపాలవుతున్న జనం
- బయట తిరగాలంటేనే భయాందోళన
- ఊరూరా అవస్థలు పడుతున్నా పట్టించుకోని యంత్రాంగం


ఎర్రుపాలెంలోని ఓ వీధిలో సంచరిస్తున్న కుక్కల గుంపు


కుక్కల దాడిలో గాయపడ్డ బాలుడు (ఫైల్)

ఎర్రుపాలెం: మండలంలోని అన్ని గ్రామాల్లో కుక్కలు, కోతుల బెడదతో ప్రజలు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. ఊరారా వీటి బెడద ఎక్కువగా ఉండడం, అవీ దాడులు చేసి గాయపరచడంతో అన్ని గ్రామాల ప్రజలు భయంతో వణికిపోతున్నారు. సమస్య తీవ్రతను ప్రజా ప్రతినిధులు, అధికార యంత్రాంగం ఏ మాత్రం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని 31 గ్రామపంచాయతీల్లో దాదాపు 30వేల వరకు కోతులు, 10 వేలకు పైగా కుక్కలు ఉన్నాయి. వీధికి 20 కుక్కలు, 50 కోతులు ఉండడంతో గ్రామాల్లో ప్రజలు జీవించడం కష్టంగా మారింది. ప్రతిరోజూ వీటి బారిన పడి పలువురు గాయాలపాలవుతున్నారు. ఇటీవల బనిగండ్లపాడు గ్రామానికి చెందిన చిన్నారులు బుంగా లక్ష్మీచంద్, బండారు లాస్య కుక్కల దాడిలో తీవ్ర గాయాల పాలై ఆస్పత్రిలో చికిత్స తీసుకున్నారు.

ఇళ్లలోకి దూరుతున్న కోతులు


కోతుల గుంపు స్వైరవిహారం

కోతులు తమ ఆహారం కోసం ఇళ్లల్లోకి దూరటం, అడ్డుకునే ప్రజలను గాయపరచడం వాటికి పరిపాటిగా మారింది. రోడ్లపై చిన్నపిల్లలు, స్కూల్‌కు వెళ్లే విద్యార్థులు నడవాలంటే వణికిపోతున్నారు. సమస్య తీవ్రతను అధికారులకు విజ్ఞప్తి చేసినా ఏ మాత్రం పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. మరోవైపు ఇంటి పెరట్లో వేసుకున్న పూల మొక్కలు, కూరగాయలు, చేలల్లోని పంటలు కూడా ధ్వంసం చేస్తున్నాయి. ఇళ్ల ఆవరణల్లో ఇష్టారాజ్యంగా సంచరిస్తూ ప్రజల్ని హడలెత్తిస్తున్నాయి. గ్రామాల్లో కోతులు స్వైరవిహారం చేస్తూ ప్రజలను గాయపరచడమే కాకుండా రైతులు సాగు చేసిన మొక్కజొన్న, ఇతరత్రా కూరగాయల తోటలను కూడా నాశనం చేస్తున్నాయి. ఇకనైనా ప్రభుత్వం స్పందించి కుక్కలు, కోతుల బెడద నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

కుక్కల బెడద నివారించాలి



గ్రామంలో కుక్కల బెడద ఎక్కువ ఉంది. వీటికి తోడు కోతులు కూడా బాగా పెరిగాయి. పలువురిని గాయపరిచాయి. పిల్లలు బడికి వెళ్లాలన్నా భయపడుతున్నారు. రోడ్డు మీదకు వెళ్లాలంటే వణుకు పుడుతుంది. అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లాం. ప్రభుత్వం స్పందించి స్పందించి చర్యలు తీసుకోవాలి

– రామాల శ్రీనివాసరావు, చిరు వ్యాపారి, ఎర్రుపాలెం

విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదు



బనిగండ్లపాడులో కుక్కలు, కోతుల బెడదపై పలుమార్లు అధికారులకు విజ్ఞప్తి చేశాం. అయినప్పటికీ పట్టించుకున్నాథులే కరవయ్యారు. వీధి కుక్కలు చిన్నపిల్లల్ని కూడా గాయపరుస్తున్నాయి. ఇక కోతుల పరిస్థితి మరీ చెప్పే పరిస్థితి లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తక్షణ చర్యలు తీసుకోవాలి.

– నీలం రవికుమార్, బనిగండ్లపాడు

నెలకు వంద మందికి పైగానే..



గ్రామాల్లో కోతులు, కుక్కలు బాగా పెరిగాయి. పలువురు గాయాలతో వ్యాక్సిన్ కోసం ఆస్పత్రికి దాదాపు నెలకు 100 మందికి పైగా వస్తున్నారు. పెంపుడు కుక్కలకు విధిగా ఏఆర్‌వీ వేయించాలి. కోతులకు, వీధికుక్కలకు సంబంధిత అధికారులు స్పందించి ట్యూబెక్టమీ ఆపరేషన్లు చేయించాల్సి ఉంది. సమస్య తీవ్రతను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం.

– డాక్టర్ సాశేత్‌రెడ్డి, పీహెచ్‌సీ, బనిగండ్లపాడు

వరద నష్టంపై నివేదికలు సిద్ధం చేయాలి

- ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాందాస్ నాయక్

వైరా: నియోజకవర్గంలో పది రోజులుగా కురుస్తున్న వర్షాలకి పంటలు, రోడ్లు, కల్వర్టులు కోతకు గురయ్యాయని అందుకు సంబంధించిన పూర్తిస్థాయి నివేదికలను అధికారులు సిద్ధం చేయాలని ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ ఆదేశించారు. మంగళవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు ఆయా మండలాల్లో జరిగిన నష్టాన్ని ప్రాథమికంగా తయారు చేశామన్నారు. నియోజకవర్గంలోని వైరా, ఏన్కూరు, కొణిజర్ల, కారేపల్లి మండలాల్లో పంట నష్టంపై వ్యవసాయశాఖ ఏడీఏ నష్ట వివరాలను కరుణశ్రీ వివరించారు. మొత్తం 34 గ్రామాల్లో 1,560 ఎకరాల్లో నష్టం జరిగిందని, 1,223 రైతులకు నష్టపోయారని వివరించారు. 195 ఎకరాల్లో ఇసుక మేట వేసిందని, అంతేకాకుండా నియోజకవర్గంలోని 5 మండలాల్లో 390 రోడ్లు కోతకు గురయ్యాయని, 572 కల్వర్టులు దెబ్బతిన్నాయని మొత్తం రూ. 16.230 కోట్ల నష్టం పంచాయతీరాజ్ శాఖకు నష్టం కలిగిందని వివరించారు. ఆర్‌అండ్‌బీ వివిధ శాఖల నష్టాన్ని అంచనా వేసి నివేదిక అందజేయాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మండల అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఏదునూరి సీతారాములు, మున్సిపల్ కమిషనర్ చింతల వేణు తదితరులున్నారు.

నేరుగా ఖాతాల్లోకి నష్టపరిహారం


మాట్లాడుతున్న రాజేందర్‌గౌడ్

కల్లూరురూరల్: తుపాను ప్రభావంతో నష్టపోయిన బాధితులకు నేరుగా తమ బ్యాంకు ఖాతాలో నష్టపరిహారం జమ చేయటం జరుగుతుందని కల్లూరు ఆర్డీఓ రాజేంద్రగౌడ్ తెలిపారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ... తుఫాను ప్రభావంతో విస్తారంగా పడిన వర్షాల వల్ల నష్టపోయిన ప్రతి కుటుంబానికి రూ.16,500 నష్టపరిహారం నేరుగా బాధిత కుటుంబాల ఖాతాలో జమ చేస్తామన్నారు. కల్లూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో భారీ వర్షాలతో కల్లూరు మండలంలో 18 కుటుంబాలు, ఏన్కూరు 2, పెనుబల్లిలో 12 , సత్తుపల్లిలో 7, తల్లాడలో 73, వేంసూరులో 47 మొత్తం డివిజన్ పరిధిలో 159 కుటుంబాలు తుఫాను బారిన నష్టపోయారన్నారు. డివిజన్‌లో తుపాను బాధితుల నష్ట పరిహారం కింద రూ.26.23 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసిందని ఈ మొత్తాన్ని బాధితుల ఖాతాలో జమ చేయడం జరుగుతుందని ఆర్డీఓ రాజేంద్రగౌడ్ తెలిపారు.

వైరా: మండలంలో 136 మంది వరద బాధితులను గుర్తించామని తహసీల్దార్ కేవీ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. వారికి ప్రభుత్వం నుండి ఒక్కొక్కరికి రూ. 16,500 చొప్పున బ్యాంక్ ఖాతాలో జమ చేసినట్లు తెలిపారు.

ముంపు ప్రాంతంలో సర్వే


సర్వే నిర్వహిస్తున్న అధికారులు

కారేపల్లి: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ముంపునకు గురైన మండలంలోని పేరుపల్లి గ్రామంలోని డబుల్‌బెడ్రూం కాలనీలో మంగళవారం అధికారులు సర్వే చేపట్టారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నిరంజన్, ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఇన్‌చార్జ్ ఏపీఓ సుధీర్, ఐకేపీ సీసీ పగడాల పుష్ప, ఉపాధి హామీ సిబ్బంది వసంత్, నాగేంద్రబాబు, వెంకటేష్ ఉన్నారు.

క్లుప్తంగా

బస్‌పాస్‌ల పంపిణీ


పాస్‌లు పంపిణీ చేస్తున్న ఆర్టీసీ సిబ్బంది

ఎర్రుపాలెం: మండలంలోని సఖినవీడు పంచాయతీ కార్యాలయంలో మంగళవారం మధిర ఆర్టీసీ డీఎం శంకర్‌రావు ఆదేశాల మేరకు పలువురు దివ్యాంగులకు 50 శాతం రాయితీతో బస్‌పాస్‌లను ఇన్‌చార్జులు షేక్ నాగుల్‌మీరా, బాణాల చిన్నబాబు పంపిణీ చేశారు. పంచాయతీ కార్యదర్శులు శ్రీలక్ష్మి, రామకృష్ణారెడ్డి, దివ్యాంగుల మండల కమిటీ అధ్యక్షుడు కోట వెంకటేశ్వర్లు ఉన్నారు.

జీపీ కార్యాలయం తనిఖీ

ముదిగొండ: మండలపరిధిలోని వెంకటాపురం పంచాయతీ కార్యాలయాన్ని డీపీఓ ఆశాలత మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పంచాయతీ ఎన్నికలకు సంబంధించి వార్డుల వారీగా ఓటర్ల వివరాలు, గ్రామంలో చేపడుతున్న పారిశుద్ధ్య పనుల వివరాలను పంచాయతీ కార్యదర్శి వెంకటేష్‌ను అడిగి తెలుసుకున్నారు. డీఎల్‌పీఓ రాంబాబు పాల్గొన్నారు.

ఆలయాల్లో అన్నదానం


మెట్టాంజనేయస్వామి ఆలయంలో..

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని అయ్యగారిపేట శ్రీ భక్తాంజనేయస్వామి, వేంసూరురోడ్‌లోని మెట్టాంజనేయస్వామి ఆలయాల్లో మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మెట్టాంజనేయస్వామి ఆలయంలో చిలుకూరి కేశవరెడ్డి, మంగతాయారు దంపతులు, శ్రీభక్తాంజనేయస్వామి ఆలయంలో ఆర్.రామారావు, కృష్ణకుమారి భక్తబృందం భక్తులకు అన్నదానం నిర్వహించారు. దేశిరెడ్డి కేశవరెడ్డి, అంకమరాజు, కాంతారావు, వెంకటేశ్వరరావు, నాగళ్లప్రసాద్, మాధవరావు, రజిని, లత, పురుషోత్తం పాల్గొన్నారు.

'మిస్ట్'లో వర్క్‌షాప్ ప్రారంభం

సత్తుపల్లిరూరల్: మండల పరిధిలోని కొత్తూరు మదర్‌థెరిస్సా అటానమస్ ఇంజనీరింగ్ కళాశాలలో మూడురోజుల పాటు సీఎస్సీ, ఏఐఎంఎల్ విద్యార్థులకు నిర్వహించనున్న వర్క్‌షాప్ మంగళవారం ప్రారంభమైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ చలసాని హరికృష్ణ తెలిపారు. విద్యార్థులు వర్క్‌షాప్‌కు హాజరవ్వాలని కోరారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చలసాని హరికృష్ణ, సీఎస్సీ విభాగం అధినేత పి.మారేశ్వరరావు, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ డాక్టర్ ఎంవి.రామచంద్రరావు, ఇంజనీరింగ్ డీన్ జాకీర్ హుస్సేన్, వర్క్‌షాప్ కో ఆర్డినేటర్ రేవతి, అధ్యాపకులు, విద్యార్థులు ఉన్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

కొణిజర్ల: మండలంలోని తనికెళ్లలో గల తెలంగాణ గిరిజన మహిళా డిగ్రీ కళాశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి గాను కంప్యూటర్ సైన్స్ బోధించడానికి గెస్ట్ లెక్చరర్ నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.శ్రీవాణి ఒక ప్రకటనలో కోరారు. ఎంఎస్సీ కంప్యూటర్ సైన్స్, బీఈడీ పూర్తి చేసిన వారు ఈ నెల 14 లోగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ నెల 17న ఉదయం 11.30 గంటలకు ఇంటర్వ్యూ నిర్వహిస్తామని తెలిపారు.

గణనాథులకు పూజలు


అయ్యగారిపేటలో..

సత్తుపల్లిటౌన్: శ్రీ గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా పట్టణంలోని గణనాథులకు మంగళవారం విశేష పూజలు నిర్వహించారు.


అన్నదానం ప్రారంభిస్తున్న దుర్గాప్రసాద్

చింతకాని: గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండల పరిధిలోని ప్రొద్దుటూరు గ్రామంలో శివ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపం వద్ద ఉత్సవ కమిటీ సభ్యులు నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ ప్రారంభించారు. కాంగ్రెస్ పార్టీ సేవాదల్ జిల్లా అధ్యక్షుడు పాషా, నాయకులు కూరపాటి కిషోర్, కిలారు మనోహర్‌బాబు, శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

సృజనాత్మకతను వెలికితీయాలి


పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ

మధిరరూరల్: విద్యార్థుల్లో దాగివున్న సృజనాత్మకతను ఉపాధ్యాయులు వెలికి తీయాలని ఎంఈఓ వై ప్రభాకర్ కోరారు. రాయపట్నం ప్రాథమికోన్నత పాఠశాలను మంగళవారం ఆయన సందర్శించి నేషనల్ అచీవ్ మెంట్ సర్వే (ఎన్ఏఎస్) పరీక్ష జరిగే తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈ విద్యా సంవత్సరం నవంబర్‌లో కేంద్ర ప్రభుత్వం 3, 6, 9 తరగతుల వారికి నాస్ పరీక్ష నిర్వహిస్తుందని, ఈ పరీక్షల్లో మధిర మండలం నుంచి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. ఆయన వెంట టీపీఎం పాఠశాల కాంప్లెక్స్ సీఆర్పీ సీహెచ్ ప్రభాకర్, హెచ్ఎం డేవిడ్ రాజు, ఉపాధ్యాయులు జనార్దన్ రెడ్డి, విజయ, విశ్వనాథం, మహేందర్ కుమార్ తదితరులు ఉన్నారు.

పంట నష్టపరిహారాన్ని రూ.25 వేలకు పెంచాలి


పంటలు పరిశీలిస్తున్న నాయకులు

బోనకల్: తుఫాన్ వలన నష్టపోయిన రైతులకు పరిహారం ఎకరాకు రూ.25 వేలకు పెంచాలని సీపీఐ జిల్లా సమితి సభ్యుడు తూము రోషన్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని రాయన్నపేటలో వైరా రిజర్వాయర్ పరివాహక ప్రాంతంలో వరదముంపునకు గురైన పంటలను పార్టీ బృందం మంగళవారం పరిశీలించింది. పార్టీ మండల కార్యదర్శి యంగల ఆనందరావు, ఆకెన పవన్, ఏలూరి పూర్ణచంద్, వీరభద్రం పాల్గొన్నారు.

ఎర్రుపాలెం: కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న ప్రతీ పంటకు ప్రభుత్వం నష్టపరిహారం తక్షణమే అందించాలని సీపీఎం మండల కార్యదర్శి దివ్వెల వీరయ్య డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పరిహారం సక్రమంగా మంజూరు కాకపోతే పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. సగుర్తి సంజీవరావు, నాగులవంచ వెంకట్రామయ్య, దూదిగం బసవయ్య, కోటి సుబ్బారెడ్డి, తదితరులున్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌ను సద్వినియోగం చేసుకోండి

కారేపల్లి: సీఎం సహాయనిధిని పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కార్యాలయ ఇన్‌చార్జ్ తంబూరి దయాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఖమ్మంలో కారేపల్లి మండలం గంగారంతండా గ్రామానికి చెందిన లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. నాయకులు ఇమ్మడి తిరుపతిరావు, మల్లేల నాగేశ్వరరావు, గుగులోతు సంతోష్‌నాయక్, తొగర శ్రీను, డేగల ఉపేందర్, గణేష్, అజ్మీర చిట్టిబాబు, భూక్యా ప్రేమ్, మంగిలాల్, సుధీర్, రాందాస్, వీరన్న, వికాస్ తదితరులు పాల్గొన్నారు.

'నా ఖమ్మం కోసం నేను'లో భాగస్వాములు కండి


కల్లూరురూరల్: దుస్తులు తరలిస్తున్న దృశ్యం


సత్తుపల్లిరూరల్: విరాళాలు అందజేస్తున్న అంగన్‌వాడీ చిన్నారులు

కల్లూరురూరల్: ఖమ్మం వరద బాధితుల సహాయార్థం ఏర్పాటు చేసిన కార్యక్రమం 'నా ఖమ్మం కోసం నేను'లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ అన్నారు. వరద బాధితుల సమాయార్థం మండలంలోని చెన్నూరు, కల్లూరులో దాతల నుంచి సేకరించిన దుస్తులను మంగళవారం వాహనంతో తరలించారు. దుస్తులు సేకరించిన వాల్ ఆఫ్ కైండ్నెస్ నిర్వాహకులు దంతాల సుధాకర్, కల్లూరు ఆర్యవైశ్య సంఘం ప్రతినిధి ఇమ్మడి చిన్నవీరభద్రరావు, ఉపాధ్యాయులు కె.విజయకుమార్, చక్రవర్తి, గుగులోతు సీతారాంలను ఎంపీడీఓ చంద్రశేఖర్ అభినందించారు.

అంగన్‌వాడీ చిన్నారుల దాతృత్వం..

సత్తుపల్లిరూరల్: ఖమ్మం వరద బాధిత సాయం కోసం అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులు విరాళాలు అందించారు. మండలంలోని గంగారం –3, రామగోవిందాపురం అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ మాసం కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు అందించిన విరాళాలను ఐసీడీఎస్ సీడీపీఓ కనకదుర్గ, సూపర్‌వైజర్ గంగాజలం సేకరించి అభినందించారు. పంచాయతీ కార్యదర్శి షీల, అంగన్‌వాడీ టీచర్లు షకీల, కృష్ణకుమారి పాల్గొన్నారు.

వేంసూరు: మండల పరిధిలోని భరణిపాడులో మాజీ సర్పంచ్ మందపాటి మహేశ్వరరెడ్డి రూ 3 వేలు నగదు, 50 కేజీల బియ్యం వితరణగా అందించారు. పలు గ్రామాల్లో దాతలు అందించిన విరాళాలను ఖమ్మంకు తరలించారు.


వేంసూరు: భరణిపాడులో..


కారేపల్లి: భారత్‌నగర్ కాలనీలో..

వినాయక మండపాల వద్ద ..

కారేపల్లి: కలెక్టర్ ఆదేశాల మేరకు కారేపల్లిలోని తొమ్మిది గణేష్ మండపాల వద్ద సింగరేణి గ్రామ కార్యదర్శి తిలక్‌కిషోర్ ' నా ఖమ్మం కోసం నేను' హుండీలను ఏర్పాటు చేసి, గణేష్ మండపాల కమిటీ సభ్యులతో మాట్లాడారు.

కొణిజర్ల: మండలంలోని పల్లిపాడు ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయకమండపంలో 'నా ఖమ్మం కోసం నేను' హుండీ ఏర్పాటుచేశారు.


కొణిజర్ల: పల్లిపాడులో..

దుస్తులు, పాత్రలు, నగదు రూపంలో విరాళాలు ఇవ్వొచ్చన్నారు.

వితరణ

కుట్టు మిషన్..

వైరా: గ్రేట్ విజన్ క్లబ్ అధ్యక్షుడు తోటకూర శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఉంద్రూ శ్యాంబాబు, వరలక్ష్మీ దంపతుల పెళ్లి రోజు సందర్భంగా వైరా పట్టణ కేంద్రానికి చెందిన ఎస్. కీర్తి అను ఆమెకు మంగళవారం కుట్టు మిషన్‌ను వితరణగా అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కాపా మురళీకృష్ణ, లగడపాటి ప్రభాకర్‌రావు, గంగవరపు కిషన్, ఉయ్యూరు రామకృష్ణ, జాలా మహలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.


వైరా: కుట్టు మిషన్ అందజేస్తున్న సభ్యులు

విద్యార్థులకు నోట్ పుస్తకాలు..

తల్లాడ: తల్లాడ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మండలంలోని అన్నారుగూడెం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు క్లబ్ అధ్యక్షుడు బెల్లంకొండ ఆంజనేయులు నోట్ పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. పసుమర్తి శ్రీనివాసరావు, క్లబ్ సభ్యులు వేమిరెడ్డి వెంకటనారాయణరెడ్డి, నంబూరి కనకదుర్గ ప్రసాద్, యాచవరపు వెంకట్‌రెడ్డి, తోట శ్రీనువాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆలయానికి..

తల్లాడ: మండలంలోని పాత మిట్టపల్లి గ్రామంలో వేంచేసి ఉన్న మల్లిఖార్జున స్వామి దేవాలయ అభివృద్ధికి ఎన్ఆర్ఐ మువ్వా సత్యంబాబు రూ.10 వేలు విరాళం ఆలయ కమిటీ సభ్యులు చిత్తలూరి నరసింహారావు అందజేశారు.

బాధిత కుటుంబానికి..

బోనకల్: మండలంలోని చిన్నబీరువల్లి గ్రామంలో పేరుబత్తిని సంజీవరావు ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి కాంగ్రెస్ నాయకులు చంద్ర శ్రీనివాసరావు రూ.8 వేలు ఆర్థికసాయం అందజేశారు. రమేష్‌బాబు, రామకృష్ణ, నాగేశ్వరరావు, మల్లిఖార్జున్‌రావు, గురవయ్య, అశోక్ పాల్గొన్నారు.


తల్లాడ: నోట్ పుస్తకాలతో విద్యార్థులు


బోనకల్: ఆర్థికసాయం అందజేస్తున్న నాయకులు

వైద్య శిబిరాలు


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

చింతకాని: మండల పరిధిలోని పాతర్లపాడు, పందిళ్లపల్లి, రామకృష్ణాపురం, జగన్నాథపురం గ్రామాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యసిబ్బంది మంగళవారం వైద్యశిబిరాలు నిర్వహించారు. రోగులను పరీక్షించి మందుల్ని పంపిణీ చేశారు. సీజనల్ వ్యాధులు, పరిసరాల పరిశుభ్రత, దోమల నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పల్లె దవాఖాన డాక్టర్ వెంకటేశ్వర్లు, భవ్య, సీహెచ్ఓ వీరేందర్, హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, పంచాయతీ కార్యదర్శులు, ఆశ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

కేన్సర్‌పై అవగాహన

కొణిజర్ల: మండల పరిధిలోని తనికెళ్లలో తెలంగాణ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో మంగళవారం బ్రెస్ట్ కేన్సర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వుయ్ కెన్ ఫౌండేషన్ సంస్థ వారు స్వచ్ఛ మహిళా, స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా అవగాహన సదస్సు నిర్వహించారు. సంస్థ రీజనల్ మేనేజర్ పావని, వైద్య, సత్యావతి, డాక్టర్ షనోద్‌లు బాలికలకు క్యాన్సర్ పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ డి.శ్రీవాణి, అధ్యాపకులు పాల్గొన్నారు.

కార్మికులకు వేతనాలు పెంచాలి

ఏన్కూరు: పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా సివిల్‌సప్లయిలో పనిచేస్తున్న హమాలీ కార్మికులకు వేతనాలు పెంచాలని, ఎగుమతులు, దిగుమతులకు క్వింటాకు రూ. 35 ఇవ్వాలని ప్రగతిశీల హమాలి అండ్ మిల్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఏన్కూరు పౌరసరఫరాల గిడ్డంగి వద్ద మంగళవారం ప్రచార కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్‌కె.లాల్‌మియా, కార్మికులు కూరాకుల సత్యనారాయణ, భూక్య నర్సింహరావు, గోపాలరావు, చింతల చెంబుడు, పురుషోత్తం పాల్గొన్నారు.

భోజన కార్మికులకు రూ.10 వేలు వేతనం ఇవ్వాలి

కల్లూరురూరల్: మధ్యాహ్న భోజన కార్మికులకు కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు నెలకు రూ.10 వేల వేతనం మంజూరు చేయాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన కార్మికులు మంగళవారం కల్లూరు ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు వేము రాంబాబు మాట్లాడుతూ.. మెనిఫెస్టో ప్రకటించిన విధంగా పదివేల వేతనం చెల్లించేందుకు వెంటనే జీఓ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు దయాకర్‌రావు, కుటుంబరావు, కార్మికులు అలివేలు, మారెమ్మ, ఆలింబీ, కస్తూరి, ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

ఐలమ్మ ఉద్యమ స్ఫూర్తి గొప్పది

భూమి, భుక్తి కోసం, ఆత్మగౌరవం కోసం పోరాడిన చాకలిఐలమ్మ ఉద్యమ స్ఫూర్తి గొప్పదని పలువురు వక్తలు అన్నారు. ఐలమ్మ వర్ధంతి సందర్భంగా మంగళవారం ఆమె విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

– సాక్షి నెట్‌వర్క్


సత్తుపల్లిరూరల్: నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మట్టా రాగమయి, నాయకులు


మధిరలో..


వైరాలో ఎమ్మెల్యే రాందాస్ నాయక్, నాయకులు